సాక్షి
కర్నూలు
శనివారం । 22 । జూన్ । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన వి.దీప్తి కుటుంబ సమేతంగా రూ.1,00,101 విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.



భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వాగ్దేవి సంగీత కళాశాల, ఓం మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ వారు నృత్యాన్ని ప్రదర్శించారు.

మహిళల ఉపాధికి ప్రోత్సాహం

- స్త్రీ నిధి కింద 93,499 మంది మహిళలకు రుణాలు
- ఐదేళ్లలో రూ.443.37 కోట్ల రుణాల పంపిణీ
- తాజాగా ఇన్సెంటివ్ రూపంలో రూ.1.80 కోట్లు విడుదల
- గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన మహళల జీవన ప్రమాణాలు



స్త్రీ నిధి రుణంతో వెల్దుర్తిలో దుకాణం ఏర్పాటు చేసుకున్న మహిళ

కర్నూలు(అగ్రికల్చర్): స్త్రీనిధితో మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులైన మహిళలు స్త్రీనిధి యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోనే రుణం చేతికి అందుతోంది. ఈ రుణాలు తీసుకుని 750 రకాల వృత్తుల ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 2021–22, 2022–23 సంవత్సరాల్లో పెద్ద ఎత్తున స్త్రీ నిధి కింద రుణాలు పంపిణీ చేసింది. అంతేకాకుండా మండల సమాఖ్యలు, గ్రామ సంఘాలకు, గ్రామ సంఘ సహాయకుల(వీవోఏ)లకు ఇన్సెంటివ్‌లు ఇచ్చారు. తాజాగా రూ.1,80,57,955 ఇన్సెంటివ్ రూపంలో అందింది. 2023–24 సంవత్సరానికి సంబంధించింది ఇన్సెంటివ్ కూడా త్వరలో విడుదల అయ్యే అవకాశం ఉంది.

ఐదేళ్లలో 93,499 మహిళలకు రుణాలు

స్త్రీనిధి కింద రుణాలు పొంది జీవనోపాధులు అభివృద్ధి చేసుకొని రాణిస్తున్న మహిళలు జిల్లాలో 93,499 మంది ఉన్నారు. ఇందులో 60 శాతం మంది గతంలో ఇతర ప్రాంతాలకు వలస పోయేవారు. స్త్రీనిధి 2011 నుంచే ఉన్నప్పటికీ మహిళలకు రుణాలు కల్పించడం అంతంతమాత్రంగానే ఉండేది. గత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రుణాలు ఇతోధికంగా ఇచ్చారు. ఇన్సెంటివ్ కిందనే రూ.1.80 కోట్లు విడుదల చేయడం విశేషం. ఇదిలా ఉండగా 2024–25లో రూ.127 కోట్లు రుణాలుగా పంపిణీ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు.



రుణాలపై చర్చిస్తున్న పొదుపు మహిళలు(ఫైల్)

ఐదేళ్లు రూ. 443.37 కోట్ల రుణాలు

సెర్ప్‌లో స్త్రీ నిధి అనేది ఒక బ్యాంకుగా అభివృద్ధి చేశారు. స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్.. వాణిజ్య బ్యాంకుల నుంచి 8 శాతం వడ్డీతో రుణాలు తీసుకొని మహిళలకు 11 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తోంది. ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు ఉండవు. జీఎస్టీ వంటి అసలే లేవు. రుణాలను 24 సమానా వాయిదాల్లో తీర్చాల్సి ఉంది. జిల్లాలో 2019–20 నుంచి ఈ ఏడాది జూలై 31 నాటికి పొదుపు మహిళల జీవనోపాధుల కోసం రూ. 443.37 కోట్లు రుణాలు పంపిణీ చేయడం విశేషం. తీసుకున్న రుణాన్ని రికవరీ చేసిన తర్వాత మళ్లీ రుణం పొందవచ్చు. గ్రూపుల వారీగా రుణాలు ఇస్తారు. వ్యక్తిగతంగా రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు రుణం లభిస్తుంది. 2019–20 నుంచి 2023–24 వరకు 93,499 మంది మహిళలు ఈ రుణాలతో వివిధవృత్తులను అభివృద్ధి చేసుకున్నారు.

పెరిగిన మహిళల జీవనప్రమాణాలు

గత ప్రభుత్వ పాలనలో మహిళల జీవనప్రమాణం గణనీయంగా పెరిగింది. ఒక వైపు స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పించడం.. మరోవైపు బ్యాంకుల నుంచి స్వయంసహాయక సంఘాలకు లింకేజీ రుణాలు ఇప్పించారు. అంతేగాక 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద రూ.18,770 చెల్లించారు. ఇవన్నీ పొదుపు మహిళల జీవనోపాధుల అభివృద్ధికి దోహదపడుతున్నాయి. చీరల వ్యాపారం, కిరాణా దుకాణాలు , పొట్టేళ్ల పెంపకం, జీవాల పెంపకం, పాడి అభివృద్ధి ఆధునిక వ్యవసాయ పనిముట్ల ఇలా అనేక వృత్తుల్లో మహిళలు నేడు విశేషంగా రాణిస్తున్నారు.

రెండేళ్ల ఇన్సెంటివ్ విడుదల

స్త్రీనిధి కింద రుణాలు ఇప్పించి జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించే డీఆర్‌డీఏ–వైకేపీ సిబ్బందికి ప్రత్యేక ఇన్సెంటివ్‌లు లభిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2021–22, 2022–23లో పెద్ద ఎత్తున స్త్రీ నిధి కింద రుణాలు పంపిణీ చేసినందుకు రూ.1.80 కోట్ల ఇంటెన్సివ్ విడుదల కావడం విశేషం. 2021–22లో మండల సమాఖ్యలు, గ్రామ సంఘాలు, గ్రామ సంఘాల సహాయకులకు రూ.86,82,851 ఇన్సెంటివ్ కింద విడుదలైంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.93,75,104 విడుదల కావడం విశేషం. రెండేళ్లలో 1,80,57,955 విడుదలైంది.

2019-20 నుంచి స్త్రీనిధి ద్వారా రుణాలు పొందిన పొదును మహిళల వివరాలు

సంవత్సరం	జీవనోపాధులు అభివృద్ధి చేసుకున్న మహిళలు	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
2019-20	2924	46.88
2020-21	14732	74.4
2021-22	24230	110.82
2022-23	25284	104.41
2023-24	26329	106.86
మొత్తం	93,499	443.37

ఇన్సెంటివ్ విడుదల వివరాలు రూపాయిల్లో..

ఇన్సెంటివ్ వివరాలు	సంఖ్య	2021-22 ప్రోత్సాహం	సంఖ్య	2022-23 ప్రోత్సాహం	మొత్తం
మండల సమాఖ్యలకు	25	19,49,317	25	20,42,104	39,91421
గ్రామ సంఘాలు	922	18,52,842	918	20,92,000	39.44,842
వీవోఏలకు	903	48,80,692	870	52,41,000	1,01,21,692



పొదుపు మహిళకు స్త్రీ నిధి కింద పొట్టేలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

48 గంటల్లో రుణసదుపాయం



పొదుపు మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకునేందుకు స్త్రీ నిధి రుణాలు చక్కగా ఉపయోగపడుతున్నాయి. స్త్రీ నిధి అనే యాప్ కూడా ఉంది. ఈ యాప్ ద్వారా లోన్ కోసం దరఖాస్తు వస్తే 48 గంటల్లోనే మంజూరవుతుంది. 750 రకాల వృత్తులలో దేనిలోనైనా రాణించవచ్చు. 2019–20 నుంచి 2022–23 వరకు రూ. 443.37 కోట్ల రుణాలు ఇచ్చాం. తీసుకున్న రుణాలను 11 శాతం వడ్డీతో 24 సమానా వాయిదాల్లో చెల్లించాల్సి ఉంది.

– సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ

న్యూస్‌రీల్

గోనెగండ్లలో మెదడువాపు వ్యాధి

గోనెగండ్ల: గోనెగండ్లలోని ఒకటో సచివాలయం పరిధిలో మెదడు వాపు వ్యాధి నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. చిన్న పిల్లవాడికి కర్నూలులో వైద్య పరీక్షలు నిర్వహించి మెదడు వ్యాపు వ్యాధిగా గుర్తించినట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో గోనెగండ్లలో పర్యటించారు. మురికి నీరు ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ రోజులు నీటిని ఇళ్లలో నిల్వ ఉంచుకోరాదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఒకటో సచివాలయం పరిధిలోని కాలనీ వాసులు 60 మందికి రక్త పరీక్షలు చేసి నమూనాలను సేకరించారు.ఈఓఆర్డీ నాగేష్, సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, పంచాయతీ ఈఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీ బదిలీ

కర్నూలు: ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగరాజు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏపీ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన రెండేళ్లుగా కర్నూలు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈయనను ఇంటెలిజెన్స్ విభాగానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

103 మందిపై సస్పెన్షన్ ఎత్తివేత

- విధుల్లోకి తీసుకుని పోస్టింగులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

కర్నూలు (అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారనే కారణంతో వివిధ శాఖలకు చెందిన 103 మంది అధికారులు, సిబ్బందిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ జిల్లా కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రెండు దఫాలుగా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్ లాల్, నగర శాఖ అధ్యక్షులు ఎంసీ కాశన్న తదితరులు సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేస్తూ శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. తాము కోరిన వెంటనే కలెక్టర్ చొరవ తీసుకుని 103 మందిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడం శుభపరాణామమని జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి అన్నారు.

తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

- 51 తెలంగాణ ట్రాక్టర్లకు అపరాధ రుసుం

కర్నూలు (టౌన్): తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ త్వకాలపై శుక్రవారం మైనింగ్, పోలీసు, రెవెన్యూ విభాగాలకు చెందిన అదికారులు సంయుక్తంగా దాడులు చేశారు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ జిల్లా రాజోలి గ్రామం నుంచి అక్రమంగా కోడుమూరు సర్కిల్ పరిధిలోకి ప్రవేశించి పెద్ద ఎత్తున తుంగభద్ర నదిలో ఇసుకను తోడేస్తున్నట్లు గమనించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మొత్తం 51 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ ఉపసంచాలకులు రాజశేఖర్ తెలిపారు. దాడుల్లో కర్నూలు తాలూకా, కోడుమూరు పోలీసులు, మైనింగ్ శాఖకు చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు దిలీప్, మురహరి, శివశంకర్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో నేడు టమాట పంపిణీ

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలులోని రైతుబజార్లలో శనివారం 'నో లాస్ నో ప్రాఫిట్' కింద మార్కెటింగ్ శాఖ టమాట పంపిణీ చేయనుంది. మదనపల్లెలో కొనుగోలు చేసిన టమాట శనివారం ఉదయానికి రైతుబజార్‌కు చేరుతుంది. కొనుగోలు ధర, రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు కలిపి నో లాస్ నో ప్రాఫిట్ కింద వినియోగదారులకు పంపిణీ చేస్తామని సి.క్యాంప్ రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ హరీష్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్నాతకోత్సవానికి వేళాయె!

- నేడు ట్రిపుల్‌ఐటీ డీఎంలో కాన్వొకేషన్
- 2020-24 బ్యాచ్ విద్యార్థులకు బీటెక్ పట్టాల అందజేత
- ఐదుగురికి బంగారు పతకాల ప్రదానం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం)లో నేడు(శనివారం)6వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం ట్రిపుల్‌ఐటీ డీఎంకు పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొదటగా ఈ విద్యా సంస్థ కాంచీపురం(తమిళనాడు) మెంటర్ ఇనిస్టిట్యూట్‌గా 2015 ఆగస్టు నెలలో ప్రారంభమైంది. మూడు బీటెక్ కోర్సులతో తరగతులు మొదలయ్యాయి. ఆ తరువాత మరో కోర్సుతో కలిపి మొత్తం నాలుగు కోర్సులతో ఏటేటా ఎంతో మంది యువ ఇంజినీర్లను ఈ సంస్థ తయారు చేస్తోంది.

అన్ని రకాల వసతులు

కాంచీపురం నుంచి 2018లో ట్రిపుల్ ఐటీ డీఎంను కర్నూలుకు తరలించారు. నగర శివారులోని జగన్నాథగట్టుపై 151 ఎకరాల స్థలంలో శాశ్వత క్యాంపస్‌ను నిర్మించారు. గట్టులో లోయలు, ఎత్తు పల్లాలు ఉన్నప్పటికీ ఆర్కిటెక్చర్ నైపుణ్యంతో కట్టిన భవనాలతో క్యాంపస్ సరికొత్త కళను సంతరించుకుంది. రూ.218 కోట్లతో పనులు చేపట్టగా, తరువాత సుమారు రూ.300 కోట్లకు చేరింది. క్యాంపస్‌లో మొత్తం 11 భవనాలు, ఐదు సెమినార్ హాల్స్ ఉన్నాయి. అలాగే ఒక మల్టీపర్పస్ హాల్ వినియోగంలో ఉంది. ట్రిపుల్‌ఐటీ డీఎంలో అడ్మిషన్ పొందేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు అనువైన వాతావరణం ఉండేలా క్యాంపస్‌ను అన్ని వసతులతో తీర్చిదిద్దారు. 151 ఎకరాల విస్తీర్ణంలోని క్యాంపస్‌లో 60 ఎకరాల్లో భవనాలు నిర్మించారు. క్రీడలకు సైతం ప్రత్యేకంగా ఇండోర్ స్టేడియం, జిమ్ ఏర్పాటు చేశారు. బాస్కెట్‌బాల్ ఆడేందుకు మైదానం, అలాగే మినీ క్రికెట్ స్టేడియాన్ని సైతం నిర్మిస్తున్నారు. విద్యార్థులకు పోస్టల్ సేవల కోసం ప్రత్యేకంగా పోస్టల్ కార్యాలయం, 24 గంటల వైఫై ద్వారా ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. సంగీతం, నృత్యాలలో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేశంలో ఉన్నటువంటి 25 ట్రిపుల్ ఐటీల్లో కర్నూలు ట్రిపుల్‌డీఎం అనతికాలంలోనే పేరుగాంచింది.



ట్రిపుల్ ఐటీడీఎం క్యాంపస్



ట్రిపుల్ ఐటీడీఎం ముఖద్వారం

143 మందికి బీటెక్ పట్టాలు

కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎంలో 2015లో మొదటగా మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్సు కోర్సులు ప్రారంభమయ్యాయి. 2019–20 అకడమిక్ ఇయర్ నుంచి అదనంగా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డాటా సైన్స్ అనే మరో బీటెక్ కోర్సును, మూడు పీహెచ్‌డీ కోర్సులను ప్రారంభించారు. మొదట 75 సీట్లతో ఉన్న బీటెక్ కోర్సులు నేడు(2023–24) 271 సీట్లకు పెరిగాయి. ఈ విద్యా సంవత్సరంలో మరి కొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంది. 6వ స్నాతకోత్సవంలో 2020–24 బ్యాచ్‌కి చెందిన బీటెక్ విద్యార్థులకు 143 మందికి పట్టాలు అందించనున్నారు. అదే విధంగా సీఎస్ఈలో ఒకరికి, ఈసీఈలో ఒకరికి, మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఒకరికి, ఓవరాల్‌గా ఒకరికి, క్యాంపస్ టాపర్‌గా ఒకరికి మొత్తం ఐదుగురు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేయనున్నారు. క్యాంపస్‌లోని కృష్ణ సెమినార్ హాలులో జరుగనున్న స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యులు, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ వీసీ డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ హాజరుకానున్నారు. ట్రిపుల్ ఐటీడీఎం డైరెక్టర్ ఆచార్య బి.ఎస్ మూర్తి, రిజిస్ట్రార్ కె.గురుమూర్తి పాల్గొననున్నారు.

ఏ పంటకు ఎంత రుణం?

- ఖరారైన పంట రుణాల పరిమితి
- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్): ఎట్టకేలకు పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖారైంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక బ్యాంకులకు చేరింది. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది మార్చి నెలలోనే జిల్లా సహకార కేంద్రబ్యాంకు టెక్నికల్ కమిటీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించింది. ఈ నివేదికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపారు. దానిని సవరించి ఆమోదించి జిల్లాకు పంపగా..ఎన్నికల కోడ్ ఉండటంతో జిల్లా కలెక్టర్ ఆమోదించలేకపోయారు. ఎట్టకేలకు ఈ నెల 18న ఆమోదం తెలుపడంతో జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ విజయకుమార్, ఎల్‌డీఎం రామచంద్రరావు ద్వారా అన్ని బ్యాంకులకు పంపారు. ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బ్యాంకులకు చేరడంలో ఆలస్యం కావడంతో పంట రుణాల పంపిణీ చేపట్టలేదు. కొన్ని బ్యాంకులు పంట రుణాలను రెన్యువల్ చేయడం వరకే పరిమితం అయ్యాయి. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ యంత్రాంగం చొరవ తీసుకొని పంట రుణాల పంపిణీని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

పంట రుణాల పరిమితి వివరాలు..

పంటపేరు	స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ (ఎకరాకు.. రూపాయల్లో)
వరి	42000-46,000
వరి విత్తనోత్పత్తి	50,000
జొన్న(వర్షాధారం)	19,000 - 22,000
జొన్న విత్తనోత్పత్తి	26,000
కొర్ర	14,000 - 15,000
కంది	19,000 - 22,000
మినుము	20,000 - 22,000
పత్తిహైబ్రిడ్(వర్షాధారం)	42,000 - 46,000
పత్తి(నీటిఆధారం)	44,000 - 50,000
పత్తి విత్తనోత్పత్తి(ప్యాకెట్స్)	1,43,000 - 1,54,000
వేరుశనగ	31,000 - 35,000
వేరుశనగ (నీటిపారుదల)	35,000 - 38,000
శనగ	31,000 - 34,000
సోయాబీన్	12,000 - 15,000
పచ్చి మిరప (వర్షాధారం)	90,000 - 95,000
పచ్చి మిరప (నీటి ఆధారం)	90,000 - 95,000
ఎండు మిరప (నీటి ఆధారం)	1,15,000 - 1,25,000
ఎండు మిరప (వర్షాధారం)	1,15,000 - 1,25,000
పొగాకు(నాటు) (వర్షాధారం)	38,000 - 42,000
పసుపు	1,00,000 - 1,10,000
అరటి టిష్యూకల్చర్	1,15,000 - 1,30,000
మామిడి	45,000 - 50,000
ఉల్లి(నీటి ఆధారం)	55,000 - 60,000
ఉల్లి (వర్షాధారం)	55,000 - 60,000
టమాట (వర్షాధారం)	33,000 - 36,000
టమాట (నీటి ఆధారం)	80,000 - 90,000
మొక్కజొన్న (వర్షాధారం)	26,000 - 28,000
మొక్కజొన్న (నీటి ఆధారం)	42,000 - 45,000
ఆముదం	18,000 - 20,00
మల్బరీ	1,00,000 - 1,10,000
క్యారెట్	30,000-35,000





కంచె కాదిది.. జల రక్ష

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. నారుమళ్ల తయారీలో బిజీగా ఉన్నారు. కర్నూలు సమీపంలోని పల్లె ప్రాంతాల కర్షకులు ఎక్కువగా ఉల్లి సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు బిందు సేద్యం పరికరాలతో నీటిని వాడి నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాపైకి ఎగజిమ్ముతున్న నీరు చేనుకు కంచెగా కనపడిన దృశ్యమిది.

- ఫొటోలు: డి. హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్

ఊరూరా 'ఏరువాక' సందడి

కర్నూలు(అగ్రికల్చర్): కల్లాకపటం కానని వాడ.. లోకం పోకడ తెలియని వాడా... ఏరువాక సాగారో రన్నో చిన్నన్న అంటూ ' సినీకవి రాసిన పాట అన్నదాతలకు చక్కగా సరిపోతుంది.'రోజులు మారాయి' చిత్రంలోని ఈ పాట వింటే వ్యవసాయానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఏరువాకకు... అన్నదాతకు అవినాభావ సంబంధం ఉంది. రైతన్నలకు ఓ పండుగ ఉంది. దీనినే ఏరువాక పౌర్ణమిగా వ్యవహరిస్తారు. అన్నదాతలకు సంబంధించిన అతి పెద్ద పండుగ ఇది. ఈ పండుగను రెండు రోజులు జరుపుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో శుక్రవారమే వేడుక నిర్వహించారు. దేవనకొండ, ఆస్పరి, హొళగుంద తదితర మండలాల్లో ఎద్దులకు పరుగుపందేలు నిర్వహించారు. పందెంలో గెలిచిన ఎద్దులను ఊరేగించారు. గెలిచిన ఎద్దులకు ఉరేగింపులో ఆహారంగా ధాన్యం పెట్టి.. అవితినగా మిగిలిన వాటిని రైతులు తీసుకెళ్లి విత్తనాల్లో కలుపుకున్నారు. ఇలా చేయడం వల్ల పంట బాగా వస్తుందనే నమ్మకం రైతుల్లో ఉంది. కొన్ని గ్రామాల్లో ఎద్దులతో పారువేట నిర్వహించారు. పండుగ రోజున బెల్లం, బియ్యం, ఆవుపాలతో పులగం వండి పశువులకు నైవేద్యంగా సమర్పించారు.



హొళగుందలో ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ వసతి గృహంలో 100 మంది విద్యార్థులకు వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన శారీరక వికలాంగులైన విద్యార్థులు తమ దరఖాస్తులను వసతి గృహ సంరక్షకునికి అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 8639152178, కార్యాలయ ఫోన్: 08518–277864 నంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి



సావిత్రిబాయిని అభినందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆమె విధులు నిర్వహించారు. ఇకపై రెగ్యులర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఆమెతో పాటు గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమణికి సైతం గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఆమె అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు.సావిత్రిబాయిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

హత్యకేసు నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరురూరల్:కురుకుంద గ్రామంలో ఈనెల 17న జరిగిన షేక్ ఖాదర్ వలి హత్య కేసులో నిందితుడు గువ్వలకుంట్ల ఫారూఖ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హతుడు షేక్ ఖాదర్, నిందితుడు ఫారూఖ్ మరికొందరు హైదరాబాద్‌లో కొవ్వా, బన్ను వ్యాపారం చేసేవారు. బక్రీద్ సందర్భంగా వారు సొంత స్థలాలకు తిరిగి వచ్చే క్రమంలో ఫారూఖ్ నడుపుతున్న ఆటో ఏస్ వాహనంలో సీట్ల సర్దుబాటులో వారి మధ్య గొడవ జరిగింది. ఆతర్వాత మరుసటి రోజున రాత్రి మద్యం సేవించి కురుకుందలో ఇద్దరు వాగ్వాద పడ్డారు. దీంతో ఆవేశంలో ఫారూఖ్ కత్తితో ఖాదర్ వలిని పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. నిందితుడు ఫారూఖ్ కురుకుంద హైస్కూల్ సమీపంలో ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, ఎస్‌ఐ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు యోగా అవసరం

– ఎస్పీ జి.కృష్ణకాంత్



పోలీసులతో కలసి యోగాసనాలు వేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు మానసిక శారీరక దృఢత్వం సాధించటానికి యోగా అవసరమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2024ను పురస్కరించుకుని శుక్రవారం పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతిరోజూ కొద్ది సమయం వెచ్చించి యోగా చేయాలన్నారు. యోగా నిపుణులు ఇంటర్నేషనల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ ఫారూల్ కూరానా, కర్నూలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ లంక నాగరాజు, అదనపు ఎస్పీలు నాగరాజు, నాగబాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగరాజు యాదవ్, ఇంతియాజ్ బాషా, పవన్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌతమి, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కర్నూలు (లీగల్): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. అనునిత్యం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమించడానికి నిజజీవితంలో యోగా అవసరమన్నారు. న్యాయ శాఖ ఉద్యోగి యోగా మాస్టర్ ముంతాజ్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కర్నూలులో యోగాసనాలు వేస్తున్న ఎంపీ నాగరాజు, అధికారులు, విద్యార్థులు



కర్నూలులో శరీరాన్ని విల్లులా వంచిన విద్యార్థిని

యోగాతో ఆరోగ్య భాగ్యం

- కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కర్నూలు (టౌన్): యోగాతో ఆరోగ్య భాగ్యాన్ని పొందవచ్చని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తి పాటి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆయుష్ శాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఏదో ఒక నినాదాన్ని ఇస్తోందన్నారు. ఈ సంవత్సరం వ్యక్తిగత, సమాజం కోసం యోగా అనే నినాదాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రపంచమంతటికీ గురువు భారతదేశమని, పూర్వం నాట్యంతో మానవాళికి ఎంతో నేర్పించారన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు యోగా, ధ్యానాన్ని అలవాటు చేసుకొని నిత్యం పాటించాలన్నారు. మనస్సు, శరీరాల మధ్య సమన్వయం కలుగజేయడమే యోగా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచంలో 192 దేశాల్లో యోగాను అదరిస్తున్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మధుసూదన్‌రావు మాట్లాడుతూ..నిత్యం యోగా చేస్తే మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. యోగాలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన కుమారి ప్రసన్నకు రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్టూడెంట్‌గా జ్ఞాపికలు అందించి గౌరవించారు. జిల్లా యోగా అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్ వారి బృందం ఆధ్వర్యంలో యోగా సాధకులు, పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగాసనాలు వేశారు. జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్‌రెడ్డి, ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ చైర్మన్ దండు లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా ఆయుష్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ లింగమూర్తి, సెట్కూర్ సీఈఓ రమణ, డీఎంఅండ్ హెచ్ఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ హాస్టల్ వసతి కల్పించాలి

- సంక్షేమభవన్‌లో ఏఐఎస్ఎఫ్ ధర్నా



బీసీ సంక్షేమాధికారిణికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి నేతలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీ సోమన్న కోరారు. నగరంలో తాత్కాలింగా మూతకు గురైన బీసీ, డీఎస్‌టీ వసతి గృహాలను వెంటనే పునః ప్రారంభించాలని, వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌పై శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సంక్షేమభవన్‌లో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ.. గురుకులాలు, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల్లో 100 మందికి మాత్రమే ప్రవేశం అనే నిబంధనను ఎత్తివేయాలన్నారు. ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించాలన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే రంగలక్ష్మీదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటలక్షుమ్మ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న హాస్టళ్ల భవనాలు పూర్తి శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా మూసి వేశామని, అద్దె భవనం లభించిన వెంటనే ఆయా హాస్టళ్లను పునః ప్రారంభిస్తామన్నారు. జేడీ రంగలక్ష్మీదేవి మాట్లాడుతూ గతంలో ఉన్న బాలుర వసతి గృహం ఎందుకు మూతకు గురైందో తెలుసుకొని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపు స్విమ్మింగ్ జట్ల ఎంపిక

కర్నూలు కల్చరల్: జిల్లా స్థాయి స్థాయి సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ జట్టు ఎంపికలు ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు కిసాన్ ఘాట్ సమీపంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్నట్లు కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.రామకృష్ణ యాదవ్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జూలై నెల 13, 14 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. గ్రూప్–1లో 15, 16, 17 సంవత్సరాల వయస్సు వారు, గ్రూప్–2లో 12, 13, 14 సంవత్సరాల వయస్సు వారు, గ్రూప్–3లో 10, 11 సంవత్సరాల వయస్సు వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బి.శివరాజ్ 9292757888 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అబ్దులాపురంలో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు

కొలిమిగుండ్ల: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో టీడీపీ నాయకులు గొడవలకు ఆజ్యం పోస్తున్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలోని అబ్దులాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. అంగన్‌వాడీ ఆయాను తొలగించేందుకు గ్రామ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఐసీడీఎస్ అధికారులు విచారణకు వచ్చారు. ఆయా పనితీరుపై ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల తల్లులతో విచారణ చేయడంతో మహిళలు గుడ్లు, ఇతర సరుకులు సక్రమంగా అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన లక్ష్మీనాయుడు కోడలు సునంద ఆయా పనితీరుపై అనుకూలంగా వివరించింది. ఎన్నికల సమయంలో పార్టీ మారడం, ఆయా విషయంలో అనుకూలంగా అధికారులకు చెప్పడంతో టీడీపీ నాయకులు కక్ష సాధింపునకు దిగారు. గ్రామ టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, మల్లికార్జున రెడ్డి, రాంభూల్‌తో పాటు పలువురు అంకిరెడ్డిపల్లె నుంచి మూడు వాహనాల్లో టీడీపీ కార్యకర్తలను అబ్దులాపురానికి పిలిపించుకున్నారు. ఇంట్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మీనాయుడును బయటకు లాగి వీధి వెంట ఈడ్చుకొని కొట్టుకుంటూ వచ్చారు. గ్రామం మధ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టేలా దుర్భాషలాడటం, సవాల్ విసిరారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారిపై ఎదురు దాడికి దిగారు. రాళ్లదాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన శివారెడ్డి, రేణుక, అపర్ణ, రాజేంద్రప్రసాద్, శంకరయ్యతో పాటు పలువురు గాయపడ్డారు. ఇరువర్గాల ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని విచారించారు. గాయపడిన వారిని చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శ్రీశైలంలో విశేష పూజలు



స్వామిఅమ్మవార్లకు హారతి ఇస్తున్న పండితుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ పూజలు జరిపించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రామళ్లకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పొలాల్లో పంటలు సాగు చేసి లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ భూములను శుక్రవారం ఆయన కన్సల్టెంట్ లక్ష్మయ్యతో కలిసి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామానికి చెందిన సూర అంజనేయులు అనే రైతు ప్రకృతి వ్యవసాయంతో అర ఎకరంలో 30 రకాల పంటల సాగుచేసిన విధానాన్ని పరిశీలించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బతినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి అందించే దిశగా రైతులు కృషి చేయాలన్నారు. రసాయనాలు అతిగా వాడితే నేల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్ భుజేశ్వరుడు, మల్లికార్జున, ఎంటీ సుధాకర్, ఎస్‌డీఏ మాబువలి, రైతులు వెంకటస్వామి, రామచంద్రుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: మండలంలోని నారాయణపురం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబు(30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలం నగరడోణ గ్రామానికి చెందిన బాబు గత ఎనిమిదేళ్ల నుంచి ఆదోని పట్టణంలోని అరుంజ్యోతినగర్ నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆలూరు వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దేవపూజ ధనుంజయ ఆచారి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి కోరారు. జిల్లాకు పరిశ్రమల శాఖ మంత్రి పదవి రావడం శుభ పరిణామమని, ఈ నేపథ్యంలోనే పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల ప్రజలు పనుల్లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతుంటారన్నారు. గుజరాత్ రాష్ట్రంలో జరుగుతున్న విధంగా గ్రామాల్లో యువతను ప్రోత్సహించేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న బీసీ భవన్‌కు నూతన భవనాన్ని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆర్టీసీ బస్సు ఢీకొని సున్నిపెంటకు చెందిన పిచ్చమ్మ (66) తీవ్రంగా గాయపడింది. స్థానిక బస్టాండ్ వెనుక ప్రాంతంలో నివసిస్తున్న పిచ్చమ్మ బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కర్నూలు 1డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టైర్ ఎక్కడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'శ్రేష్ట'లో సత్తా చాటిన మద్దికెర విద్యార్థి



షారోన్

మద్దికెర : కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా లెవల్‌లో నిర్వహించిన శ్రేష్ట పరీక్షల్లో మద్దికెర విద్యార్థిని షారోన్ ప్రతిభ కనబరిచింది. దేశంలోనే 75వ ర్యాంకు సాధించి సత్తా చాటినట్లు తల్లిదండ్రులు రాజేంద్ర కుమార్, సుమలత శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎస్సీలకు ఉచిత విద్య అందించేందుకు కేంద్రప్రభుత్వం శ్రేష్ట పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. గత నెలలో 11వ తరగతి ప్రవేశానికి దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించగా తమ కుమార్తె ప్రతిభ కనబరిచిందన్నారు.

చాబోలులో ప్రబలిన అతిసారం

- 30 మందికి తీవ్ర అస్వస్థత
- బాధితుల్లో అధికంగా చిన్నారులు
- కర్నూలు, నందికొట్కూరు ఆసుపత్రులకు తరలింపు



తాగునీటి ట్యాంకులో కొంగ కళేబరం



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు మజారా గ్రామమైన చాబోలులో అతిసార వ్యాధి ప్రబలింది. వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి గ్రామానికి చెందిన 30 మంది అతిసారం బారిన పడ్డారు. వీరిలో ఐదేళ్లలోపు వయస్సున్న శ్వేత, హని, సురేష్, సుమంత్‌తో పాటు మరొకరు నందికొట్కూరు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రోహిత్, దక్షిత్, ధాత్రి, బెనితాలను తల్లిదండ్రులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడ చికిత్సలు చేయిస్తున్నారు. మిగిలిన వారు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్నారు. పారుమంచాల డాక్టర్ యశస్విని, డాక్టర్ గంగాధర్, హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, వైద్యసిబ్బంది గురువారం రాత్రి నుంచే వైద్యశిబిరం నిర్వహించి బాధితులకు చికిత్స నిర్వహిస్తున్నారు.

గ్రామాన్ని సందర్శించిన అధికారులు

విషయం తెలుసుకొన్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు మంజుల, సామేలు, గ్రామంలో పర్యటించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. అలాగే అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి, రాష్ట్రీయ బాలల శిశుసంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ కాంతారావునాయక్ చాబోలు గ్రామంలో పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకొన్నారు. వారికి డయేరియా ప్రబలడానికి గలకారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఇకపై కాచివడగట్టిన మినరల్‌వాటర్ మాత్రమే తాగాలని, మజ్జిగ, టెంకాయ నీళ్లు తాగడంతో పాటు చారు అన్నం మాత్రమే తినాలని వారు బాధితులకు సూచించారు. ఆరోగ్యం ఇబ్బంది కరంగా ఉంటే వెంటనే వైద్యశిబిరంలో వైద్యం చేయించుకోవాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు గ్రామంలో ఇళ్లిళ్లు తిరిగి క్లోరైడ్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయటంతో పాటు ఎప్పటికప్పుడు గ్రామస్తుల ఆరోగ్యస్థితిగతులు తెలుసుకోవాలని ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం: డీపీఓ మంజులవాణి



గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

చాబోలు గ్రామానికి చేరుకొని డయేరియా వ్యాప్తికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామంలోని ట్యాంకులను ఎన్నిరోజులకోసారి శుభ్రం చేస్తున్నారు? ఎంతమంది ట్యాంకుల్లోని నీటిని తాగుతున్నారు? అనే విషయాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీఓ మంజులవాణి విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో 80 శాతం మంది మినరల్‌వాటర్‌ను తాగుతుండగా మిగిలిన 20 శాతం మంది మాత్రమే ట్యాంకుల నీటిని తాగుతున్నట్లు తెలిసిందన్నారు. ట్యాంకులను శుభ్రం చేయించడం ,క్లోరినేషన్ చేయించడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే తాగునీటి ట్యాంకులో కొంగ పడి చనిపోయి నీళ్లు కలుషితమైనట్లు గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనేది తేలితే పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తాగునీటిశాఖ డీఈ విద్యాసాగర్, ఏఈ నాగేంద్ర గ్రామంలో పర్యటించి గ్రామంలోని తాగునీటి ట్యాంకులు, బోర్లలోని నీటిని సేకరించి శ్యాంపిల్స్ నిమిత్తం ల్యాబ్ పంపించినట్లు తెలిపారు.